# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 04-05-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ వేవ్స్ సదస్సులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం క్రియేటివ్ ల్యాండ్ ఆసియా ప్రైవేట్ లిమిటెడ్‌తో ఒక అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది.
- ❖ రాష్ట్రంలో వర్షాల నేపథ్యంలో హోం, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత జిల్లాల అధికారులను అప్రమత్తం చేశారు.
- ❖ వైద్య కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్) ఈ రోజు ప్రశాతంగా ముగిసింది.
- ❖ పరోపకారానికి, సహనానికి ప్రతిరూపం భగీరథ మహర్షి అని వెనుక బడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత పేర్కొన్నారు.
- ❖ రాష్ట్రంలో రాగల రెండు రోజుల్లో పలు జిల్లాలకు విపత్తు నిర్వహణ సంస్థ తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది.

========================

రాష్ట్రంలో మొట్టమొదటి "ట్రాన్స్ మీడియా ఎంటర్‌టైన్‌మెంట్ సిటీ"ని అభివృద్ధి చేయడానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రముఖ కంపెనీ క్రియేటివ్ ల్యాండ్ ఆసియా ప్రైవేట్ లిమిటెడ్‌తో అవగాహన ఒప్పందం చేసుకుంది. ముంబైలో జరుగుతున్న వేవ్స్ సదస్సులో భాగంగా ఈ ఒప్పందం జరిగింది. దీనిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సామాజిక మాధ్యమం వేదికగా స్పందిస్తూ... భారతదేశ మొట్టమొదటి ట్రాన్స్‌మీడియా ఎంటర్‌టైన్‌మెంట్ సిటీ క్రియేటర్ ల్యాండ్‌ను అమరావతిలో ప్రారంభించడానికి ప్రభుత్వం ఆ సంస్థతో చారిత్రాత్మక అవగాహన ఒప్పందం చేసుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. 25 వేల ఉద్యోగాలను సృష్టించే లక్ష్యంతో ఈ ప్రాజెక్ట్ పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు స్థానిక ఉపాధి అవకాశాలను కల్పిస్తుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

========================

భగీరథ మహర్షి జయంతి సందర్భంగా సగర కులస్తులకు ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు సామాజిక మాధ్యమం వేదికగ శుభాకాంక్షలు తెలిపారు. గంగను భువికి తెచ్చిన ఆ మహనీయుడిని స్మరించడం మనందరి కర్తవ్యమని, ఏదైనా సాధించాలనే పట్టుదలకు భగీరథ ప్రయత్నం ఒక స్ఫూర్తి అని ముఖ్య మంత్రి అన్నారు.

పరోపకారానికి, దీక్షకు, సహనానికి ప్రతిరూపం భగీరథ మహర్షి అని వెనుక బడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత పేర్కొన్నారు. విశాఖ జిల్లా గాజువాకలో ఈ రోజు ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి భగీరథ జయంతి కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులతో కలిసి భగీరథుని విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ... భగీరథుని కఠోర శ్రమ, చూపిన దీక్ష ఎప్పటికీ మరువలేనిదని, ఆయన ఆశయాలను కొనసాగించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల్లో బీసీలు అధికంగా లబ్ధి పొందుతున్నారని తెలిపారు. బీసీలు అభివృద్ధి చెందడానికి విద్య ఎంతో అవసరమని చెప్పారు.

జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ వెనుకబడిన తరగతుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేస్తున్న కృషిని వివరించారు.

=======================

రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడి వర్షాలు కురుస్తున్నాయి. కొన్ని జిల్లాల్లో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురుస్తోంది. ఈ గాలుల ప్రభావంతో మామిడికాయలు రాలిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పలుచోట్ల రహదారుల వెంట వృక్షాలు నేలకొరిగాయి.

వర్షాల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. హోం మంత్రి వంగలపూడి అనిత విపత్తు నిర్వహణ శాఖ ఎండీ రోనంకి కూర్మనాథ్ తో మాట్లాడి... తాజా పరిస్థితిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చెయ్యాలని, అవసరమైన మేరకు సహాయక చర్యలు అందించేందుకు సన్నద్ధంగా ఉండాలని కలెక్టర్లు, ఎస్పీలను మంత్రి ఆదేశించారు.

రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో కురుస్తున్న అకాల వర్షాలతో రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక శాఖల అధికారులకు సూచించారు.

ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గంలో అకాల వర్షం కారణంగా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా పటిష్టమైన భద్రత చర్యలు, సహాయక కేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులను రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశించారు. వివిధ ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేయాలని మంత్రి సూచించారు.

విరామం

=======================

వైద్య కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష(నీట్) ఈ రోజు రాష్ట్ర వ్యాప్తంగా ప్రశాంతంగా ముగిసింది. మధ్యాహ్నం 2 గంటల ఉంచి 5 గంటల వరకు పరీక్ష జరిగింది. ఉదయం 11 గంటల నుంచి అభ్యర్థులను పరీక్ష కేంద్రాలకు అనుమతించారు. పరీక్షా కేంద్రాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాత మాత్రమే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న వర్షాల కారణంగా పరీక్ష కేంద్రాలకు చేరుకోవడానికి అభ్యర్థులు కొంత ఇబ్బందిపడ్డారు. విశాఖపట్నం పరిధిలో ఈ పరీక్ష 16 కేంద్రాలలో జరిగింది.

=======================

రాష్ట్రంలో పలు జిల్లాలకు విపత్తుల నిర్వహణ సంస్థ తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. రాగల రెండు రోజులు ప్రకాశం, కృష్ణా, బాపట్ల, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. వర్షాలతో పాటు పిడుగులు పడే అవకాశం ఉందని గంటకు 60 నుంచి 85 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీయవచ్చని హెచ్చరించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

=======================

యువతరం వ్యాయామాన్ని జీవితంలో అంతర్భాగంగా చేసుకోవాలని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.పి రాజశేఖర్ అన్నారు. ఈ రోజు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఆదేశాలతో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నిర్వహించిన "సండే ఆన్ సైకిల్ క్యాంపెయిన్" కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య రాజశేఖర్ మాట్లాడుతూ.. "ఫిట్ ఇండియా మిషన్"లో భాగంగా యుజిసి యువతలో శారీరక వ్యాయామం, ఆరోగ్యం పట్ల అవగాహన పెంపొందించే ఉద్దేశంతో దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తోందని చెప్పారు. "ఫిట్ నెస్ కా డోస్ - ఆదాగంట రోజ్" అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. యుజిసి అందిస్తున్న సూచనలను స్వీకరిస్తూ... ఏయూలో ఈ కార్యక్రమాన్ని నేడు ప్రారంభించామని అన్నారు. ఒత్తిడితో కూడిన నుంచి ఉపసమనం పొందడానికి వ్యాయామం ఎంతగానో ఉపకరిస్తుందని రాజశేఖర్ పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

========================

చందనోత్సవం రోజున సింహాచలం కొండపై గోడ కూలిన దుర్ఘటనలో మరణించిన ముగ్గురి కుటుంబ సభ్యులకు ఈ రోజు నష్ట పరిహారం చెక్కులను ప్రభుత్వం అందించింది. భీమిలి నియోజకవర్గంలోని చంద్రంపాలేనికి చెందిన పిల్లా ఉమా మహేష్, శైలజ దంపతుల కుటుంబీకులకు, అడవివరానికి చెందిన యడ్ల వెంకట్రావు కుటుంబానికి ఒకొక్కరికి 25 లక్షల రూపాయల చొప్పున ప్రభుత్వ సహాయాన్ని సయుంక్త కలెక్టర్ మయూర్ అశోక్ అందజేశారు.

========================

అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండల కేంద్రంలో ఈరోజు నుంచి మూడు రోజుల పాటు జరగనున్న గిరిజన ఆరాధ్య దైవం శ్రీ మోదకొండమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. అరకు నియోజకవర్గ శాసనసభ్యులు రేగం మత్స్య లింగం అమ్మవారి ఘటాలను మోసి శతకం పట్టు వద్ద చేర్చి ప్రత్యేక పూజలు చేశారు. మూడు రోజులపాటు జరిగే అమ్మవారి ఉత్సవాలలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆలయ ఉత్సవ కమిటీ, పోలీస్, రెవెన్యూ, పంచాయతీ  అధికారుల కు ఆయన సూచించారు.

========================

మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ (జీవీఎంసీ) ప్రధాన కార్యాలయంలోను, అన్ని జోనల్ కార్యాలయాలలోనూ "ప్రజా సమస్యల పరిష్కార వేదిక  (PGRS) కార్యక్రమాన్ని రేపు ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తామని విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, జివిఎంసి ఇన్‌ఛార్జి కమిషనర్ ఎమ్.ఎన్. హరేంధిర ప్రసాద్ పత్రికా ప్రకటనలో తెలిపారు. వివిధ విభాగాలకు సంబంధించిన సమస్యలపై ప్రజలు పీజీఆర్ఎస్ కార్యక్రమంలో అర్జీల ద్వారా సమస్యలను అధికారుల దృష్టికి  తీసుకు రావాలని తెలియచేశారు.

========================
========================